# బాంబులున్నాయి జాగ్రత్త!

వాణిశ్రీ




సికింద్రాబాద్ వెళ్లవలసిన ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫారం మీదకు వచ్చి ఆగింది. కిరణ్మయి యస్-5 రిజర్వ్‌డ్ కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కింది. తనకు రిజర్వ్ అయిన సీటులో ఎవరో అతను కూర్చుని ఉన్నాడు.

''ఈ సీటు నాకు రిజర్వ్ అయిందండీ'' అన్నది కిరణ్మయి.

అతను నిర్లక్ష్యంగా తలపైకెత్తి చూశాడు. చింపిరి జుట్టు, నల్లకళ్లద్దాలు, వెలసిపోయినట్లున్న జీన్స్ ప్యాంటు, షర్టు, నిండా పాతికేళ్లు ఉండవు. స్టూడెంటో, కాదో కూడా తెలియడం లేదు. ముఖం చూస్తే పొగరుబోతులా కనిపిస్తున్నాడు.

''సో వాట్?'' అన్నాడు.

''ప్లీజ్‌గెటప్'' సీరియస్‌గా అన్నది కిరణ్మయి.

''అక్కడ నా సీట్లో కూర్చో!'' ఒక మూలంగా ఇద్దరు యువకుల మధ్య ఉన్న సీటు చూపించాడు.

''అవసరం లేదు. ముందు లేవండి''

''లేవకపోతే?''

''ట్రైన్ కదలదు.''

కిరణ్మయి ముఖంలో కోపం చూసి అతను కొంచెం జంకినట్లు కనిపించాడు.

''అరేయ్! పోన్లేరా! పాపకి రిజర్వ్ అయిందట కదా! లేచి వచ్చెయ్!'' అతని ఫ్రెండ్ కాబోలు అన్నాడు.

అతను అటూ ఇటూ చూసి లేచి తన సీట్లో కూర్చున్నాడు.

''జేజమ్మలా ఉందిరోయ్! జాగ్రత్త'' అన్నాడు ఎవడో.

''కత్రినాకైఫ్‌లా కత్తిలా ఉందిరోయ్!''

''కాబోయే స్టారేమో?''

''పెద్ద రొమాంటిక్ హీరోనంటావు కదా! సిటీ వెళ్లే లోపల కిస్సుల వరకు తీసుకెళ్లు చూద్దాం''

కిరణ్మయి కిటికీ పక్క సీట్లో సెటిలైంది. ఆమె పక్కన ఎవరో ఎనభై ఏళ్ల ముసలాయన జోగుతున్నాడు. ఎదురు సీట్లో అంతా ఆ అల్లరి కుర్రాళ్లే. పక్కసీట్లో ముసలాయన తప్ప పెద్దవాళ్లెవరూ లేరు.

వాళ్లు వల్గర్ కామెంట్స్ చేస్తున్నారు.

కిరణ్మయికి సెండాఫ్ ఇవ్వడానికొచ్చిన మాలతి ప్లాట్‌ఫారం మీద నిలబడింది. రైలు కూత పెట్టింది బయల్దేరడానికి రెడీ అన్నట్లు.

''ఏయ్ కిరణ్! సూట్‌కేసు కదలకుండా చూసుకో'' అన్నది మాలతి. .

''సీటు కిందే ఉందిలేవే! ఎందుకు కదులుతుంది?'' అన్నది కిరణ్మయి నవ్వుతూ.

''ఏం లేదు. బాంబులు ప్రెస్సయితే పేలిపోతాయి. కేర్‌ఫుల్‌గా ఉండు'' అన్నది మాలతి.

'బాంబులు' అనే మాట వినగానే యువకులంతా బిత్తరపోయినట్లు కనిపించారు. ఒకరి ముఖం మరొకరు చూసుకున్నారు. కామెంట్స్ ఠక్కున ఆగిపోయాయి. మాలతి వైపు, కిరణ్మయి వైపు భయం, భయంగా చూశారు. కలా? నిజమా? అన్నట్లు ఆశ్చర్యంలో మునిగిపోయారు. బాంబులు ఏమిటి? ఒక ఆడపిల్ల సూట్‌కేసులో తీసుకెళ్లడం ఏమిటి?

ట్రైన్ కదిలింది. మాలతి ట్రైన్‌తో పాటూ ప్లాట్‌ఫారం మీద వడిగా అడుగులు వేస్తోంది.

''హేండ్ బ్యాగ్‌లో రివాల్వర్ జాగ్రత్త!'' అన్నది మాలతి.

''సరే''

''బుల్లెట్స్ మ్యాగ్జయిన్‌లో నుంచి తీసేశావా? లేదా?'' అడిగింది మాలతి.

''తియ్యలేదే! లోడ్‌చేసే ఉన్నాయి''

''బుల్లెట్స్ వేస్ట్ చెయ్యకు. నీకు అసలే కోపం ఎక్కువ. టపటపమని కాల్చేస్తావు.'' అరుస్తోంది మాలతి.

''అబ్బ! కాల్చనులేవే? ఊరికే ఎందుకు కాలుస్తాను?'' విసుగ్గా అన్నది కిరణ్మయి.

''వెళ్లగానే బాంబులు, రివాల్వర్ అన్నయ్యకి ఇచ్చెయ్.'' అరిచి చెప్పింది మాలతి.

''సరే! ఇక నువ్వు ఉండు.'' అన్నది కిరణ్మయి చెయ్యి ఊపుతూ.

ఎదురు సీట్లో, పక్క సీట్లో కూర్చున్న కుర్రాళ్లు సంభ్రమాశ్చర్యాలతో కిరణ్మయిని చూస్తున్నారు. వాళ్ల కళ్లకి ఆమె ఒసేయ్ రాములమ్మ, కడప రెడ్డెమ్మ వంటి ధీరవనితలా కనిపిస్తోంది. ఈమె ఏ ఫ్యాక్షన్ కుటుంబానికో చెంది ఉంటుంది. పబ్లిగ్గా బాంబులు కేరీ చేస్తున్నదంటే ఎంత గుండె ధైర్యం ఉండాలి. బాంబులతోపాటు రివాల్వర్ కూడా ఆమె హేండ్ బ్యాగ్‌లో లోడ్ చేసి ఉందంటే, ఎంత పలుకుబడి ఉన్న కుటుంబమో వాళ్లది?

కుర్రాళ్లంతా బెదిరిపోయినట్లు మౌనంగా కూర్చున్నారు కొంతసేపు. ఇకఇకలు, పకపకలు ఆగిపోయాయి. ముఖాలు కళావిహీనమయ్యాయి. అప్పటి వరకు ఆమె మీద జోక్స్ కట్‌చేసినందుకు విచారిస్తున్నవాళ్లలా, గుసగుసలాడుకుంటున్నారు.

కిరణ్మయి మాత్రం ఒక ఇంగ్లీషు నవల తెరిచి చదువుకోసాగింది. అప్పుడప్పుడు కళ్లెత్తి కంపార్ట్‌మెంట్‌లో అందరి వంకా చూస్తోంది.

''సమోసాలు, వేడివేడి సమోసాలు'' అని బుట్టలో సమోసాలు పెట్టుకుని అరుస్తున్నాడు ఒక వెండర్. వాడి నోట్లో నుంచి లాలాజలం తుంపరలు సమోసాల మీద పడుతున్నాయి. అదేమీ పట్టని జనం ఎగబడి కొని తింటున్నారు. కిరణ్మయి వళ్లు అసహ్యంతో జలదరించింది.

''ఛీ.. ఎట్లా తింటున్నారో?'' అనుకుంది.

బఠానీ గుగ్గిళ్లు, వేరుశనక్కాయలు, జామకాయలు అమ్మేవాళ్లు వస్తూపోతూ ఉన్నారు. కొందరు ఏదొచ్చినా కొని తినడమే పనిగా పెట్టుకున్నారు.

కిరణ్మయి అప్పుడప్పుడూ బాటిల్ ఎత్తి మంచి నీళ్లు తాగుతున్నదే గానీ, ఏమీ తినడం లేదు.

రైలు పరిగెత్తుతోంది.

★ ★ ★

ట్రైన్ సికింద్రాబాద్ స్టేషన్‌లో ఆగీ ఆగగానే కంపార్ట్‌మెంట్‌లోకి పోలీసులు బిలబిలమంటూ వచ్చేశారు. మూతికి మాస్క్ కట్టుకుని బాంబు డిస్పోజ్‌స్క్వాడ్ వాళ్లు వెంట ఉన్నారు. వాళ్లతో పాటు కుక్క ఉంది.

పోలీసుల్ని చూసి కుర్రాళ్లు సంతోషం వ్యక్తపరిచారు.

''సార్! ఈమె దగ్గరే..'' అని కిరణ్మయిని చూపించారు.

కిరణ్మయి పోలీసుల్ని చూసి కంగారుపడలేదు.


''మేడమ్! మీ సూట్‌కేసు చెక్ చేయాలి'' అన్నాడు ఇన్‌స్పెక్టర్ ఆమె ముందు నిలబడి.

ఆమె మౌనంగా సీటు కింద నుంచి సూట్‌కేసు బైటకు లాగింది. తనే కీతో లాక్ తీసింది. పోలీసులు తెరిచి చూశారు. అందులో ఆమె డ్రెస్‌లు తప్ప ఏం లేవు. ఆమె హేండ్‌బ్యాగ్ చెక్ చేశారు. అందులో ట్రైన్ రిజర్వేషన్ టికెట్, కొన్ని కరెన్సీ నోట్లు, చిన్న నోట్‌బుక్, కొన్ని నాణాలు ఉన్నాయి.

కుర్రాళ్లు వెర్రిమొఖాలు వేసుకుని చూస్తూ నిలబడ్డారు.

''మీ సూట్‌కేసులో బాంబులున్నాయనీ, హేండ్ బ్యాగ్‌లో రివాల్వర్ ఉందనీ ఎవరో ఫోన్ చేశారు'' అన్నాడు ఇన్‌స్పెక్టర్.

''వీళ్లల్లో ఎవరో ఒకరై ఉంటారు'' ఎదురుగా నిలబడిన కుర్రాళ్లని చూపిస్తూ అన్నది కిరణ్మయి.



''వీడే సార్! మీకు ఫోన్ చేసింది'' సోడాబుడ్డి కళ్లద్దాలు పెట్టుకుని మేధావిలా కనిపిస్తున్న అతన్ని చూపించారు.

''ఏమయ్యా! నువ్వేనా ఫోన్ చేసింది? ఏం పిచ్చి పిచ్చిగా ఉందా? అమ్మాయిల్ని ఏడిపించడానికి ఇటువంటి ఫోన్లు చేస్తావా? ఈవ్ టీజింగ్ కేసు పెట్టి కోర్టు చుట్టూ తిప్పుతా?'' కోపంగా అన్నాడు ఇన్‌స్పెక్టర్.

''సార్! ఈమెకు సెండాఫ్ చెప్పడానికి వచ్చిన అమ్మాయి అన్న మాటల్ని బట్టి మీకు ఫోన్ చేశాను సార్!'' అన్నాడు అతను భయపడిపోతూ.

''ఏం? అన్నది చెప్పు?'' అడిగాడు ఇన్‌స్పెక్టర్.

స్టేషన్లో ప్లాట్‌ఫారం మీద నడుస్తూ మాలతి అన్న మాటల్ని వివరంగా చెప్పాడు.



''ఏమమ్మా? ఎవరా అమ్మాయి? అనవసరంగా సూట్‌కేసులో బాంబులున్నాయనీ, హేండ్ బ్యాగ్‌లో రివాల్వర్ ఉందనీ ఎందుకు అన్నది?'' అడిగాడు ఇన్‌స్పెక్టర్ కిరణ్మయిని.

''ఆ అమ్మాయి నా ఫ్రెండ్ సార్! మాలతి'' చెప్పింది కిరణ్మయి.

''ఎందుకలా చెప్పింది? ఎవర్ని భయపెట్టడానికి?''

''దానికి మెంటల్ డిజార్డర్ ఉంది సార్! అప్పుడప్పుడూ బాంబులు, బుల్లెట్లు, తుపాకీలు అని పిచ్చిపిచ్చిగా వాగుతుంటుంది. మెంటల్ డిజార్డర్‌కి సైకియాట్రిస్ట్ దగ్గర ట్రీట్‌మెంట్ ఇప్పిస్తున్నారు'' చెప్పింది కిరణ్మయి.

''ఐ.సీ..!''

''అదేం చెప్పినా వూ... కొట్టాలి. లేకపోతే తిడుతుంది. గొడవ చేస్తుంది. అందుకే అదేం చెప్పినా 'సరే' అంటాం.''

''ఎందుకలా పిచ్చిదైంది? వాళ్లదేమైనా ఫ్యాక్షన్ ఫ్యామిలీనా?''

''అబ్బే లేదు సార్! ఫ్యాక్షన్ సినిమాలు చూసి చూసి అట్లా అయిపోయింది. సినిమా హాల్లోనే కాక సీడీలు తెచ్చి తెగ చూసేది. పాపం అలా పిచ్చిదైపోయింది'' చెప్పింది కిరణ్మయి.

★ ★ ★

ఆటోలో కూర్చున్న కిరణ్మయి సెల్ మోగింది.

''ఏమే! చేరావా?'' అడిగింది మాలతి.

''చేరక చస్తానా? నీ వెధవ వాగుడితో చచ్చే చావొచ్చింది. సికింద్రాబాద్ చేరగానే పోలీసులొచ్చి పట్టుకున్నారు బాంబులున్నాయని. సూట్‌కేసు, హేండ్ బ్యాగు చెక్ చేశారు''

''రౌడీ వెధవలు కంపార్టుమెంటులో ఉన్నారని అట్లా బెదరగొట్టాలే! జర్నీ అంతా నోర్మూసుకుని ఉంటారు'' నవ్వుతూ అన్నది మాలతి.

''పోలీసుల్ని మేనేజ్ చేశాలే! మా ఫ్రెండ్‌కి మెంటల్ అని...'' పకపక నవ్వింది కిరణ్మయి.

''ఏయ్! నాకు మెంటలా?''

''లేకపోతే? బాంబుల్తో ప్రాక్టికల్ జోకులా? ఏదో మేనేజ్ చేశాను కాబట్టి పోలీసులు వదిలారు. స్టేషన్‌కి పట్టుకెళ్లి వుంటే, టీవీ ఛానెల్స్ వాళ్లకి పని పడేది'' అని పకపకా నవ్వింది కిరణ్మయి.

''వార్తల్లో వ్యక్తులయ్యే వాళ్లం. ఛాన్స్ మిస్సయింది'' అన్నది మాలతి.

O